కొండనాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడిందన్న చందంగా ఉంది జాతీయ రహదారిపై ప్యాచ్ వర్కుల తీరు. ప్రమాదకరంగా ఉన్న గోతులు పూడ్చి ప్రయాణం సాఫీ చేయాల్సింది పోయి వాహనదారులకు మరిన్ని కష్టాలు తెచ్చిపెడుతున్నారు. **తూతూ మంత్రంగా పనులు చేపట్టడంతో రోడ్లు గుబురు** గుబురుగా మారాయి. **దీంతో ప్యాచ్ వర్క్‌లు ప్రమాద ఘంటికలుగా** మారాయని వాహన **చోదకులు మండిపడుతున్నారు.**

ప్యాచ్ వర్క్‌లా... ప్రమాద ఘంటికలా!



శీలానగర్ నుంచి పాతగాజువాక వైపు ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద దిమ్మెలుగా తేలిన ప్యాచ్ వర్క్‌లు



శీలానగర్ పెట్రోల్ బంక్ జంక్షన్ వద్ద

- తూతూ మంత్రంగా **గుంతల పూడ్చివేత**
- రోడ్డు ఎత్తుపల్లా**లు ఉండడంతో** వాహనదారుల **అవస్థలు**
- ఇవేం పనులు **అంటూ మండిపాటు**



చట్టివానిపాలెం వద్ద గోతులు తేలిన రోడ్డు

ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ప్యాచ్ వర్క్‌లు

అక్కిరెడ్డిపాలెం: జాతీయ రహదారిపై ప్యాచ్ వర్క్‌లు చేపట్టిన చోట తారు దిమ్మలుగా వేశారు. అవి వాహనచోదకుల నడ్డి విరుస్తున్నాయి. దీంతో పాటు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు మరింత దెబ్బ తిన్నాయి. దీంతో పాటు ప్యాచ్ వర్కులు పైపై పూత అన్న చందంగా వేయడంతో అవి కూడా శిథిలమవుతున్నాయి. మరి కొన్ని చోట్లఅస్తవ్యస్తంగా పని చేశారు.దీంతో గోతులు పూడ్చడానికి చేపట్టిన ప్యాచ్ వర్క్‌లతోనూ అవస్థలు తప్పడం లేదు.

శీలానగర్ నుంచి పాతగాజువాక వరకూ తిప్పలే

శీలానగర్ నుంచి పాతగాజువాక వరకు, పాత గాజువాక నుంచి శీలానగర్ వరకు ప్యాచ్ వర్క్‌లు చేశారు. ఇష్టాను సారంగా తారుతో కూడిన కాంక్రీట్ వేయడంతో పలు చోట్ల ఎత్తు పల్లాలతో ప్రమాదకరంగా మారింది. వాహన చోదకుల ఒళ్లు హూనం అవుతుంది.

ప్రమాదాలు ఇలా

ద్విచక్రవాహనచోదకులు, కార్లు, ఇతర లైట్ వాహనాలు ప్యాచ్ వర్క్‌లు ఉన్న రోడ్డుపై నుంచి వెళ్తున్నప్పుడు వాహనాలు ఎగిరి పడుతున్నాయి. దీంతో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. దిమ్మెల నుంచి వాహనం తప్పించడానికి స్లో అయినప్పుడు వెనుక నుంచి వచ్చే వాహనాలు వీరిని ఢీ కొట్టడం వంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్యాచ్ వర్క్ చేసి చోటు నుంచి ప్రయాణించే టప్పుడు బస్సులో ప్రయాణికులు సైతం సీటులో కుదుపులతో అవస్థలు పడుతున్నారు. స్పీడ్‌బ్రేకర్ల మాదిరి ఉన్న రోడ్లపై ప్రయాణించడంతో నడుంనొప్పులతో పాటు వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు.

అక్కడ ఇంకా గోతులే...

ఆర్ అండ్ బీ తూతూ మంత్రంగా ప్యాచ్ వర్క్‌లు చేపట్టినా పాతగాజువాక నుంచి శీలానగర్ వైపు మార్గంలో చట్టివానిపాలెం వద్ద ఇంకా గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. అక్కడక్కడ పనులు చేపట్టినట్లు తారు పనులు చేపట్టారు. ఈ ప్రాంతంలోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు.

ప్యాచ్ వర్క్‌లు చేసిన చోట ఇంకా అవస్థ



నిత్యం నగరం నుంచి ఆటోనగర్‌కు వస్తుంటాను. శీలానగర్ నుంచి ఆటోనగర్ వరకు ప్యాచ్ వర్క్‌లు చేసిన చోటు నుంచి ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటాను. ప్యాచ్ వర్క్‌లు వేసిన చోట రోడ్డు రోలర్‌తో రోడ్డుకు సమానంగా చేయించకుండా వదిలేయడంతో ఇవి దిమ్మెలుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి.

– వినోద్, ఆటోనగర్

నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలి



నాతయ్యపాలెం నుంచి గాజువాక వెళ్తున్న క్రమంలో ప్యాచ్ వర్క్‌లు చేపట్టిన చోట రోడ్డు ఎత్తుగా ఉండడంతో ద్విచక్రవాహనంతో ఎగిరిపడుతున్నాను. వీటిని తప్పించబోయి వెనుక నుంచి వచ్చే వాహనాలతో ప్రమాదానికి గురికావాల్సి పరిస్థితులు ఎన్నో మార్లు కలిగాయి. ప్యాచ్ వర్క్‌లు చేపట్టినా అవస్థలు తప్పడం లేదు. నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– గోపిశెట్టి సన్యాసిరావు, నాతయ్యపాలెం

హోరాహోరీగా ఎన్నికల ప్రచారం

నేడే స్టీల్ క్లబ్ ఎన్నికలు



ఉక్కునగరం: స్టీల్‌క్లబ్ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగింది.బరిలో ఉన్న వారు తమ అనుచరులతో కలిసి ప్రచారం హోరెత్తించారు. విజయతీరానికి చేరిస్తే ఎలాంటి కార్యక్రమాలు చేపడతారో హామీలు ఇచ్చారు. తమకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు.

ఒక పోస్టు ఏక గ్రీవం

సంయుక్త కార్యదర్శి పోస్టు ఏకగ్రీవం కాగా కార్యదర్శి పోస్టుకు నలుగురు, కోశాధికారి పోస్టుకు ఐదుగురు పోటీలో ఉన్నారు. అభ్యర్థులు అన్ని విభాగాలు తిరుగుతూ సభ్యులను కలిసి ఓటు అభ్యర్థించారు. అయితే ఈ ఎన్నికల్లో క్లబ్ క్వార్టర్లు అద్దెకు ఇవ్వడం, సభ్యులకు ఏటా ఇచ్చే గిఫ్ట్‌లను దుర్వినియోగం చేయడం, క్లబ్‌కు చెందిన ప్రాంతాన్ని అనధికారికంగా లీజుకు ఇవ్వడం, క్లబ్‌లో డెకరేషన్, లైటింగ్‌లో చేతివాటం చూపటం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రస్తుత కార్యవర్గంలోని ప్రధాన వ్యక్తులు మరలా పోటీ చేయడాన్ని సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. అదే విధంగా అంతకు ముందు పాలకవర్గంలో క్లబ్ నిధులు దుర్వినియోగం చేశారని నాటి డైరెక్టర్ (పర్సనల్), విజిలెన్స్ విభాగానికి ఆ కమిటీలోని సభ్యులే ఫిర్యాదు చేయగా ఆ ఫిర్యాదు ఎదుర్కొన్న వ్యక్తులు కూడా ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేస్తుండడంతో సభ్యులు నివ్వెరపోతున్నారు.

మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పోలింగ్

క్లబ్ కార్యవర్గ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3.30 గంటల వరకు మరలా సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఈ మేరకు ఎన్నికల అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ముగిసిన ఓట్ల లెక్కింపు చేపడతారు. ఏ రాత్రి అయినా ఫలితాలు వెల్లడించనున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాబూ నాయక్ తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

గోదాదేవికి ఘనంగా కుత్తువిళక్ పూజ



గోదాదేవికి హారతి ఇస్తున్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కుత్తువిళక్ పూజ ఘనంగా నిర్వహించారు. ధనుర్మాస పూజల్లో భాగంగా ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరినారాయణ ఆధ్వర్యంలో గోదాదేవి అమ్మవారికి పూజలు చేసి దీపంతో హారతి ఇస్తూ పాశుర విన్నపం చేశారు. భక్తులు కూడా దీపాలతో హారతి ఇచ్చి పాశుర విన్నపం చేశారు. అంతకు ముందు తెల్లవారుజాము 4 గంటలకు వేంకటేశ్వరస్వామి, గోదాదేవిలకు సుప్రభాత సేవ, సేవాకాలం నిర్వహించారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నక్షత్ర హారతి



గోదాదేవికి నక్షత్రహారతి ఇస్తున్న భక్తులు

అగనంపూడి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవికి 58 ఒత్తులతో నక్షత్ర హారతి సమర్పించారు. పొన్నాగు ఆకుపై హారతి వెలిగించి అమ్మవారికి హారతి అందజేశారు. 24వ పాశురం చదివి వినిపించారు. ఆలయ ధర్మకర్త ఈకే చారి దంపతులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం గొబ్బెమ్మలు చుట్టూ నృత్య ప్రదర్శన చేశారు. వసుంధర బృందంతో వీనులవిందుగా సంగీత కచేరి చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు సాయిబునాయుడు, నరసింగరావు మాస్టర్, సత్యనారాయణ, కృష్ణారావు, గురునాథ్, సోమశేఖర్, ఉమామహేశ్వరరావు, మోహిని, నాగలక్ష్మి పాల్గొన్నారు.

మంచినీటి బోర్ల ప్రారంభం



మంచినీటి బోరును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చందు

గాజువాక: జీవీఎంసీ 70వ వార్డులోని శ్రామికనగర్, చట్టివానిపాలెంలో జీవీఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన మంచినీటి బోర్లను వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ ద్వారా సరఫరా అవుతున్న నీటితో పాటు ప్రత్యామ్నాయంగా బోర్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కొణతాల రాము, చట్టిబాబు, చట్టి అప్పలరాజు, తమ్మినాయుడు, ప్రసాదరాజు, పాపారావు, దేవుడుబాబు, సంతోష్ పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ టెండర్ అడ్డుకుంటాం

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ టెండరు కోసం ఎవరొచ్చినా అడ్డుకుంటామని, ప్రైవేటీకరణను ఆపే వరకు పోరాడతామని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు సీహెచ్ పద్మనాభరాజు తెలిపారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 100వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి ప్రైవేటీకరణ టెండర్ కోసం ఎవరొచ్చినా అడ్డుకుని తీరాలని, తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికుల కృషితోనే ఆస్పత్రి అభివృద్ధి సాధ్యమైందని, సుమారు 40 వేల మంది పోర్టు ఉద్యోగులు, వారి కుటుంబాలకు వైద్య సేవలందించే ఆస్పత్రి ప్రైవేటీకరణ అనైతికమన్నారు. కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, కేఎస్ కుమార్, నాయుడు పాల్గొన్నారు.

ముగిసిన ఉక్కు కార్మికుల 36 గంటల దీక్ష



మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ప్రభుత్వాల తీరు మారకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కార్పొరేటర్ బి.గంగారావు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ సభలో ప్రకటించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 36 గంటల దీక్ష బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారంపై కన్నేసిన కేంద్రం వారి తాబేదారులకు స్టీల్‌ప్లాంట్‌ను అప్పగించాలనే యోచనలో ఉన్నారని ఆరోపించారు. కర్ణాటకలోని ఒక చిన్న స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక సాయం అందించిన కేంద్రం ఆసియాలో అతిపెద్దది అయిన విశాఖ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు ఎందుకు మొగ్గు చూపుతున్నారని ప్రశ్నించారు. ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం పూర్తి సామర్థ్యంతో నడిచేలా ఆర్థిక సాయం అందించాలని, బకాయిలు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, వై.టి.దాస్, ఎన్.రామారావు, వరసాల శ్రీనివాసరావు, కారు రమణ, రమణమూర్తి, మాటూరి శ్రీనివాసరావు, దాసరి సురేష్‌బాబు, డి.వి.రమణారెడ్డి, టివికె రాజు, కె.ఎం.శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, డి.ప్రసాద్, ఉరుకూటి సుహాసిని, మోహన్‌బాబు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఒప్పందాల అమలుకు జీవో విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

గాజువాక: మున్సిపల్ కార్మికులు గతంలో నిర్వహించిన సమ్మె కాలంలో జరిగిన ఒప్పందాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయాలని సీపీఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ ప్రయోజనాలు, పదేళ్ల సర్వీసు దాటినవారికి ఆర్థిక ప్రయోజనాలు, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాల పెంపు తదితర అంశాలపై వెంటనే జీవో విడుదల చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు కావస్తున్నా ఈ ఒప్పందంపై స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ డిమాండ్ల సాధనకు జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 10న నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గొలగాని అప్పారావు, గొల్ల రాము, నక్క నాగరాజు, వై.చిన్నారావు, ఎస్.గణేష్, మీనాక్షి, వరలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

భెల్ ఉద్యోగుల నిరసన



భెల్ ప్రధాన గేటు వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ భెల్ (హెచ్‌పీవీపీ) ప్రొగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో బుధవారం భెల్‌ప్రధాన గేటు వద్ద నిరసన చేపట్టారు. సిటూ ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ బీహెచ్‌పీవీ సంక్షోభంలో ఉన్నప్పుడు స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల తమకు మద్దతుగా నిలిచాయన్నారు. స్టీల్‌ప్లాంట్ సంక్షోభంలో ఉన్న సమయంలో తమ పూర్తి మద్దతు తెలియజేస్తూ ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భాగస్వాములుగా నిలుస్తున్నామన్నారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన బ్యాడ్జీలను కార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రొగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు ఉరుకూటి బాబూరావు, ఎస్.జగన్నాథరావు, వి.ఆనందరావు, పి.కనకారావు, సీతంనాయుడు, కె.కేశ్య, ఎస్.వెంకట్రావు, సీహెచ్.మురళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్యాగాల ఫలితమే విశాఖ స్టీల్‌ప్లాంట్



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ శ్రేణులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ పార్కులో చేస్తున్న దీక్షలు 1329వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని, ప్లాంట్ సొంత గనులు కేటాయిస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశభక్తి పేరు చెప్పి సంపదను కారు చౌకగా ప్రైవేటు వ్యక్తులకు ధారపోయడం అన్యాయమన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల వచ్చింది కాదన్నారు. 67 గ్రామాల ప్రజలు ఇళ్లు, పొలాలు, ఆస్తులు త్యాగం చేస్తే వచ్చిందని గుర్తు చేశారు. 61 మంది సీపీఎం నాయకులు స్టీల్ ప్లాంట్ కోసం పదవీ త్యాగాలు చేశారన్నారు. ఈ ఉద్యమంలో 32 మంది బలిదానం చేశారని తెలిపారు. ప్లాంట్ పన్నులు, డివిడెండ్ల రూపంలో రూ. 50 వేల కోట్లు ప్రభుత్వానికి చెల్లించిందన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలంటే ఇక్కడి ప్రజల ఆమోదం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, ప్రకాశరావు, వై.రాజు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత మై ఫిట్నెస్ జట్టు



విజేత జట్టుకు ట్రోఫీ, చెక్ అందిస్తున్న కోమటి శ్రీనివాసరావు

అగనంపూడి: సంక్రాంతి పండగను పురస్కరించుకొని 86, 87వ వార్డుల స్థాయిలో వడ్లపూడి గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతగా మై ఫిట్నెస్ జట్టునిలిచి ట్రోఫీని దక్కించుకుంది. నాలుగు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో 8 జట్లు పాల్గొనగా మై ఫిట్నెస్ జట్టు ప్రథమ బహుమతి, గోవింద్ సీసీ ద్వితీయ బహుమతిని చేజిక్కించుకున్నాయి. తృతీయ స్థానంలో గల్లీ బాయ్స్ జట్టు నిలిచింది. ముగింపు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు చేతుల మీదుగా ట్రోఫీని, రూ.44,444 చెక్ అందించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, జెర్రిపోతుల ఈశ్వరరావు, వడ్లపూడి ఈశ్వరరావు, న్యాయవాది హరిప్రసాద్, నిర్వాహకులు కాండ్రేగుల దినేష్, సిరపనొట్టి చెన్నకేశవ, మొల్లి మహేష్, గోవింద్ పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ముమ్మరంగా ఏర్పాట్లు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం

పెదగంట్యాడ: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ 65వ వార్డు పవాంబే కాలనీలో వేంచేసియున్న వైకుంఠ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల చెప్పారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో ముక్కోటి ఏకాదశికి సంబంధించి నిర్వహించనున్న పూజా కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనాలు కల్పించనున్నామని తెలిపారు. స్వామి వారి దర్శనం తర్వాత భక్తులకు తీర్థ ప్రసాదాలతో అన్న ప్రసాదం కూడా అందించనున్నామని వివరించారు. కార్యక్రమంలో అప్పలరెడ్డి, పెంటకోట నాగేశ్వరరావు, తిప్పల స్వాతి, గొలుసు రామలక్ష్మి, ఉషారాణి, పద్మావతి, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనం రేపు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శుక్రవారం ఉత్తర ద్వార దర్శనాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేసినట్లు దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు బుధవారం తెలిపారు. శుక్రవారం ఉదయం 4 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం, 4.30 నుంచి 5.30 గంటల వరకు విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల శ్రీ ప్రసన్న వేంకటేశ్వరాలయంలో శుక్రవారం ఉత్తర ద్వార దర్శనం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పాలిటెక్ ఫెస్ట్‌లో గైస్ విద్యార్థుల ప్రతిభ



పాలిటెక్ ఫెస్ట్‌లో ప్రత్యేక అవార్డు పొందిన గైస్ విద్యార్థులు

మురళీనగర్ : విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పాలిటెక్ ఫెస్ట్ 2024 – 25లో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీలో వీరు రూ.25 వేల కన్సొలేషన్ బహుమతిని మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అందుకున్నారు. ప్రమాదాలను నియంత్రించేందుకు యానిమేటెడ్ ఏరియల్ వెహికల్ (యూఏవీ) డ్రోన్‌ను గైస్ విద్యార్థులు పి.భవానీ శంకర్, ఆర్.పైడిరాజు, ఎస్కే అబ్దుల్ రజాక్, టి.ప్రనూష్ విద్యార్థుల బృందం రూపొందించింది. విద్యార్థులను గైస్ ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ అభినందించారు.

ధర్మారావుకు తెలుగు కీర్తి పురస్కారం

సీతంపేట : అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు యం.వి.ధర్మారావు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 21న విజయవాడలో జరగనున్న కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నారు. తెలుగు సాహిత్యం, సాంస్కృతిక కళా ప్రక్రియల్లో, వివిధ రంగాల్లో సేవలందించిన ప్రతిభావంతులు, సాహితీమూర్తులకు, కళాకారులకు ఏటా శ్రీశ్రీ కళావేదిక తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాలు అందజేస్తోంది. ఈ పురస్కారానికి ధర్మారావు ఎంపిక కావడం పట్ల పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనరస, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

ఏబీవీపీ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు

డాబాగార్డెన్స్: ఈ నెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించనున్న ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ బుధవారం నగరంలోని ఓ హోటల్లో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, రఘు విద్యా సంస్థల అధినేత రఘు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వర్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత 75 ఏళ్లుగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేశ అభివృద్ధిలో అనేక విధాలుగా భాగస్వామ్యం పంచుకుందని గుర్తు చేశారు. ఏయూ ఇంజినీరింగ్ గ్రౌండ్ వేదికగా ఈ నెల 24 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఏబీవీపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు చిరేగి శివకుమార్, రాష్ట్ర కార్యదర్శి యాచంద్ర పాల్గొన్నారు.